క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించండి..

టేకులపల్లి: ఇల్లెందు మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. పీఆర్సీ, పీఎఫ్, మేడే కానుక, వేతన బకాయిలను చెల్లించకపోవడం వల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ కార్మికులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

రైతు భరోసాపై రేపు సదస్సు

టేకులపల్లి: బేతంపూడి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై సలహాలు, సూచనలు తీసుకునేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు సుక్కాల బోడు రైతు వేదికలో రైతు సదస్సు ఏర్పాటు చేసినట్లు సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు హాజరై సూచనలు ఇవ్వాలని కోరారు.

తాగునీరు అందించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు ప్రజలకు తాగునీరు అందించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రామవరం మంచినీటి సరఫరా కోసం వాటర్ ట్యాంక్ గతంలో నిర్మాణం చేశారు. ఆ ట్యాంకు నుంచి ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు.

ఉద్యోగ విరమణ



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో బదిలీ పిల్లర్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగిన పోగుల సత్యనారాయణ అందరికీ ఆదర్శమని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు అన్నారు. సంస్థలో 37ఏళ్ల పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సత్యనారాయణ దంపతులను శనివారం సన్మానించారు. ఈ మేరకు జీఎం హాజరై మాట్లాడారు. అధికారులు శివకేశవులు, మురళి, అనిల్, వంగా శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'లైవ్' జోనల్ కోఆర్డినేటర్‌గా రవి



టేకులపల్లి: లంబాడీల ఐక్య వేదిక(లైవ్) భద్రాద్రి జోన్ కోఆర్డినేటర్‌గా టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామానికి చెందిన భూక్యా రవిరాథోడ్ ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం సంఘం రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్‌నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రమేష్‌తో పాటు నాయకులకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నియామకం



జాఫర్ హుస్సేన్

ఇల్లెందు: టీబీజీకేఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన జాఫర్ హుస్సేన్, సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా రంగనాథ్‌లను నియమించారు. శనివారం జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ కన్వీనర్‌గా మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా పని చేశానని తెలిపారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

ఉర్దూ స్కూల్‌లో డిజిటల్ తరగతులు

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీలో డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. శనివారం ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, 20వ వార్డు కౌన్సిలర్ మొగిలి లక్ష్మి డిజిటల్ క్లాసులు ప్రారంభించారు. మాట్లాడుతూ... విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు ఎంతో ఉపయోగం అన్నారు. సామాజిక అంశాలకు, వార్తలకు, బోధనకు ఈ డిజిటల్ క్లాసులు ఉపయోగపడతాయన్నారు. గడిపర్తి శ్రీనివాసరావు తన తండ్రి గడిపర్తి భద్రయ్య పేరు మీద టీవీని పాఠశాలకు వితరణగా అందజేయటం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైతులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులు శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను జూలూరుపాడులో కలిసి వినతిపత్రం అందజేశారు. రామచంద్రాపురం, అనంతారం గ్రామాలకు చెందిన గిరిజన రైతులు మాజీ వైస్ ఎంపీపీ కొడెం సీతాకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. తమకు నష్టపరిహారం అందించలేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

మౌలిక వసతులు కరువు

- 'గూడెం' సంతలో ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు
- ప్లాట్‌ఫాం లేదు.. విద్యుత్ సరఫరాపై పట్టింపు లేదు..
- నిరుపయోగంగా టాయిలెట్లు..



కొత్తగూడెంలోని వార సంతలో రద్దీ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీకి ప్రతీ ఏడాది రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చే వార సంతలో కనీస వసతులు లేవు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో చిరువ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కొత్తగూడెం సింగరేణి హెడ్డాఫీసు పక్కన, గోధుమవాగు బ్రిడ్జి మధ్యలో ఉన్న ఖాళీ స్థలం, జాతీయ రహదారి రోడ్డులో ప్రతీ ఆదివారం వార సంత జరుగుతుంది. ఈ సంతలో ఒక్కరోజు వ్యాపారం చేసేందుకు చుట్టుపక్కల మండలాలైన జూలురుపాడు, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, కొత్తగూడెంలోని చిరువ్యాపారులు వందల సంఖ్యలో ఆదివారం తెల్లవారుజామునే సంతకు వచ్చి తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తుంటారు. ఇందులో ఎక్కువగా కూరగాయలు, అల్లం, ఉల్లిపాయలు, పాతదుస్తులు, ప్లాస్టిక్ సామగ్రి, పండ్లు, జంతువుల, కోళ్ల అమ్మకాలు, ఇనుప సామగ్రి, పూలు, పండ్ల మొక్కలు అమ్మకాలు చేస్తారు. వాటిని కోనుగోలు చేసేందుకు కొత్తగూడెం చుట్టుపక్కల అన్నీ ప్రాంతాల నుంచి వినియోగదారులు వస్తారు. అమ్మకాలు తెల్లవారుజాము నుంచి మొదలుకొని రాత్రి 10 గంటల వరకు కొనసాగుతాయి. అయితే ప్రతి ఏడాది మున్సిపల్ అధికారులు వారపు సంతకు వేలంపాట నిర్వహించి, వేలంలో దక్కించుకున్న వారికి సంతలోని దుకాణాల నుంచి ఫీజులు వసూళ్లు చేసేందుకు అనుమతులు ఇస్తారు. అయితే గత ఏడాది వేలంపాటలో సంతకు దక్కించుకున్న వారు అధికార బలంతో మున్సిపాలిటీకి పూర్తి డబ్బులు చెల్లించకుండానే దాదాపు రూ.25 లక్షలు ఎగ్గొట్టారు. అప్పుడు పాలకవర్గం కానీ, అధికారులు కానీ ఎగ్గొట్టిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనివలన మున్సిపాలిటీ ఆదాయానికి నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కూడా ఇటీవల అధికారులు వేలంపాట నిర్వహించగా సరైన ధర రాలేదని రెండుసార్లు వాయిదా వేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి అధికారులు సంతపై నిర్ణయం తీసుకోనున్నారు.

సదుపాయాలు నిల్...

కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రతీ ఆదివారం నడుస్తున్న వార సంతలో కనీస సదుపాయాలు లేకపోవడం వలన చిరువ్యాపారులు, వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు మున్సిపాలిటీకి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నందుకు ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ వసతుల కల్పనను అధికారులు గాలికి వదిలివేశారు. సంతలో ప్రధానంగా దుకాణాలు ఏర్పాటు చేసే చోట ప్లాట్‌పాం లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం కాబట్టి కచ్చితంగా ప్లాట్‌పాం అవసరం ఉంటుంది.

ప్లాట్‌ఫాం లేకపోవడం వలన వ్యాపారులు మట్టినేల పైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేయాల్సి వస్తోంది. వర్షాలు పడితే బురదలోనే వ్యాపారం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటుగా తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కూడా సంతలో అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతుంటాయి కాబట్టి, కనీసం విద్యుత్ సదుపాయం, లైట్లు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులు ఇవ్వడం, తీసుకోవడంలో తేడాలు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో పాటుగా ప్రధానంగా సంతలో చిరువ్యాపారం చేసేవారిలో మహిళలు కూడా ఉంటారు. సంతలో ఉన్న టాయిలెట్స్ పని చేయకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం లేని దృశ్యం



నిరుపయోగంగా టాయిలెట్లు

సదుపాయాలు కల్పిస్తాం..



కొత్తగూడెంలోని వార సంతలో చిరు వ్యాపారులు, వినియోగదారులకు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. సంతలో ప్రధానంగా ప్లాట్‌పాం నిర్మాణం కోసం చర్చలు జరుగుతున్నాయి. దీంతో పాటుగా దుకాణాలకు లైట్ల ఏర్పాటు చేసి, టాయిలెట్స్‌లో నీటి సరఫరా ఏర్పాటు చేయిస్తాం.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. శానిటేషన్ పనులు చేపట్టేందుకు బ్లీచింగ్, సున్నం, సిబ్బందికి రెయిన్ కోట్స్, సబ్బులు, చెప్పులు, వాహనాల రిపేరుకు రూ.23 లక్షలు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి, దినసరి మార్కెట్, కబేళాను వేలంపాటలో దక్కించుకున్న వారికి కేటాయించడానికి, సంతకు సంబంధించిన అంశాన్ని కలెక్టర్‌కు నివేదించుటకు కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ శేషాంజన్‌స్వామి, డీఈ రవికుమార్, మేనేజర్ సత్యనారాయణ, టీపీఓ నవీన్‌కుమార్, టీపీఎస్.ప్రభాకర్, ఏఈలు పాల్గొన్నారు.

గనుల వేలానికి వ్యతిరేకంగా ఆందోళనలు



మాట్లాడుతున్న కాపు కృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేసి సింగరేణికే కేటాయించాలనే డిమాండ్‌తో ఆందోళనలు నిర్వహించనున్నట్లు టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ తెలిపారు. కొత్తగూడెంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1న నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలపడంతో అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని, 3వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేయడమే కాక 6వ తేదీన జీఎం ఆఫీసుల ఎదుట ధర్నా, 9న గోదావరిఖనిలో నిరసన తెలపనున్నట్లు చెప్పారు. ఈ ఆందోళనల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, కిరణ్, విజయ్, మురళి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గనులు సింగరేణికి వచ్చేలా చూడండి...

బొగ్గు బావులు సింగరేణికే కేటాయించాలని కృషి చేయాలని సీఐటీయూ నాయకులు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం ఆయనకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. నాయకులు భూపాల్, బాలాజీ, రాములు, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్

ఇల్లెందురూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో స్థలం అనువుగా ఉన్న చోట కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసేందుకు ప్రస్తుత హరితహారంలో ప్రణాళిక రూపొందించినట్లు జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ పరిధిలోని అధికారులతో సమావేశమై శాఖాపరంగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుభాష్‌నగర్ హైస్కూల్‌ను సందర్శించారు. హరితహారం మొక్కలు, పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్త్ ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామరు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, పీఆర్ ఏఈ రాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు, ఏపీఎం దుర్గారావు, సూపరింటెండెంట్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ పార్వతి, హెచ్ఎం ఉమాశంకర్, కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

ముున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఎట్టకేలకు మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించారు. శనివారం మున్సిపల్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తొలుత చైర్మన్, కమిషనర్, ఎమ్మెల్యేను లోపలకు వెళ్లనిచ్చినప్పటికీ కౌన్సిలర్లను మాత్రం తమ గోడు వినిపించుకునేందుకు అవకాశం కల్పించాలని వేడుకున్నారు. కార్మికులు వార్డుల్లో పని చేస్తుంటారని, వారి కష్టాలు మీకే ఎక్కువ తెలుస్తాయని, వారి తరుపున కౌన్సిల్‌లో ప్రస్తావించి సహకరించాలని మున్సిపల్ కార్మికులు వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య కమిషనర్, చైర్మన్‌తో చర్చించి కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్‌జానీపాషా, కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, కార్మిక సంఘం నేత యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు, గురునాథం, కృష్ణ, భారతి, మహేష్, సదా, భూలక్ష్మి, కుమార్, వెంకటేశ్వర్లు, వీరస్వామి, జలంధర్‌రెడ్డి, ఉమ, ఎల్లబాయి, రాజమ్మ, రాజు, రఫీ, సల్మాన్ తదితరులు ఉన్నారు.

పీసీసీ మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం



పాల్వంచ: డి.శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతికి పట్టణ కాంగ్రెస్ కమిటీ ప్రగాఢ సంతాపం, వారి కుటుంబానికి సానుభూతిని తెలిపింది. శనివారం ఇల్లెందులో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డి.డానియేల్, జాఫర్, సుదర్శన్‌కోరీ, స్వరూప, హైజాక్, బోళ్ల సూర్యం, గుండంపల్లి సతీష్, కమల్ కోరీ, బండారీ రాములు, పత్రై శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్, రామకృష్ణ, శంకర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. డీఎస్ మృతి పట్ల శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బద్ది కిశోర్, భట్టు మురళీ, దొప్పలపూడి సురేశ్, చింతా నాగరాజు, కాల్వ భాస్కర్, సాధం రామకృష్ణ, పెంకి శ్రీను, బీఎస్ చారి, మిరియాల కమలాకర్, రమేశ్, నందిని, రామారావు, మధు, గోపి, పిలక రమేశ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు 'భరోసా' అందించాలి

చుంచుపల్లి: ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం అర్హులైన ప్రతీ రైతుకు అందించడమే లక్ష్యమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు అన్నారు. శనివారం హౌసింగ్ బోర్డు సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మహాజన సభలో వారు మాట్లాడారు. జిల్లాలోని రైతుల నుంచి రైతు భరోసా పథకంపై అభిప్రాయలు సేకరించి ప్రభుత్వానికి పంపడానికి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ముందుకొచ్చి సలహాలు అందించాలన్నారు. ఈ ప్రత్యేక సభలో సొసైటీ డైరెక్టర్లు, రైతుల అభిప్రాయలను నమోదు చేశారు. అదనపు వ్యవసాయ సంచాలకులు డి.రమేష్, సొసైటీ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాథరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సేద్యం చేసే భూములకే ఇవ్వాలి..

జూలూరుపాడు: సేద్యం చేసే భూములకే రైతు భరోసా వర్తింపజేయాలని రైతులు అభిప్రాయపడ్డారు. మండలకేంద్రం జూలూరుపాడులోని సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతు భరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరిగింది. వ్యవసాయశాఖ జిల్లా అధికారి వేల్పుల బాబురావు సమక్షంలో రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

రుణాలన్ని మాఫీ చేయాలి..

రైతుల వ్యవసాయ రుణాలన్ని మాఫీ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షంకు శనివారం ఆయన వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. రైతుల భూములు ఆన్‌లైన్ చేయలేదని, రుణమాఫీకి పట్టాదారు పుస్తకాలు కావాలని కోరడం అన్యాయమన్నారు.

హామీలు అమలు చేయాలి..

ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ డిమాండ్ చేశారు. జూలూరుపాడులో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రైతుభరోసా, రైతు రుణమాఫీ వెంటనే చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేడు ఆంక్షలు విధిస్తోందని విమర్శించారు.



చుంచుపల్లి: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు



జూలూరుపాడు: సమావేశంలో పాల్గొన్న రైతులు

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

జూలూరుపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ఐసీడీఎస్ జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం జూలూరుపాడులో శనివారం జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలకు సరఫరా అయ్యే ఉప్పు, పప్పు దినుసులు ఇతర పదార్థాలు నాసిరకంగా ఉంటున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి రూ.కోట్లు మంజూరవుతున్నా కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విన్నవించారు. ముత్యాల విశ్వనాథం, సాయి, భూక్యా లలిత, సునీత, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సోమయ్య

పాల్వంచ: ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. శనివారం స్థానిక వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల సమావేశంలో మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్ర్య కావాలని మొట్టమొదట నినాదం ఇచ్చింది కమ్యూనిస్ట్‌లేనన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన చరిత్ర, మూడువేల గ్రామాలను విముక్తి కల్పించిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం పరిచి వారిని పోరాటాల వైపు తీసుకురావడానికి కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల పక్షాన నిలబడేది, ప్రజా సమస్యలపై కొట్లాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఎంబీ నర్సారెడ్డి, పుల్లయ్య, కె.బ్రహ్మాచారి పాల్గొన్నారు.

పాత బస్సులతో డ్రైవర్లు పరేషాన్

- కాలం చెల్లిన బస్సులు.. కనికరం లేని అధికారులు
- సదుపాయాలు లేక విలవిల
- ఇల్లెందు శాటిలైట్ బస్సు డిపో పరిస్థితి



ఇల్లెందు డిపోకు కేటాయించిన పాత బస్సులు

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపోలోని 20 బస్సులూ కాలం చెల్లినవే. కొత్త డిపోకు పాత బస్సులు ఇచ్చామనే కనికరం కూడా ఆర్‌టీసీ అధికారులకు లేదు. కొత్త డిపో నుంచి పాత బస్సులు నడపలేక డ్రైవర్లు పరేషాన్ అవుతున్నారు. బస్సు డిపో ప్రారంభమై 10 నెలలు గడిచినా అవే పాత బస్సులు నరకం చూపిస్తున్నాయి. ఇటీవల గుండాల వెళ్లిన బస్సు పోలారం వద్ద అప్ ఎక్కలేకపోవడంతో ప్రయాణికులను దించి నడిపించాల్సి వచ్చింది. హైదరాబాద్ వెళ్లే బస్సులు పలుచోట్ల ఆగిపోయిన సందర్భాలూ ఉన్నాయి. జగదాంబ సెంటర్‌లో సూపర్ లగ్జరీ బస్సు ఆగిపోయింది. ప్రయాణికులను దించి మరో బస్సులో పంపించారు. ఖమ్మం, సూర్యాపేటలోనూ సూపర్ లగ్జరీ బస్సులు నిలిచిపోయాయి. 12 లక్షల కిలోమీటర్లు రీడింగ్ పూర్తి చేసిన బస్సులను తీసివెయ్యాలి. ఇల్లెందులో ఉన్న అన్ని బస్సులు 13 లక్షల కిలోమీటర్లు దూరం ప్రయాణం చేసినవే. దీంతో ఎక్కడో ఒకచోట మోరాయిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇక డిపోలో కనీస సదుపాయాలు లేక అక్కడి డ్రైవర్లు, కండక్టర్లు విలవిలలాడుతున్నారు. ఆఘమేఘాల మీద ప్రారంభోత్సవం చేసి అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. ఇల్లెందు శాటిలైట్ బస్ డిపోలో పేరుకుపోయిన సమస్యలతో సతమతం అవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో కొత్త బస్సులు కొనుగోలు చేసినా ఇల్లెందు కొత్త డిపోకు మాత్రం అన్ని డిపోల నుంచి వాడిన పాత బస్సులను కేటాయించారు.

చెప్పింది ఒకటి... చేసింది మరోటి..

2023 ఆగస్టు 28న ఆనాటి రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ టీఎస్ఆర్టీసీ బస్సు డిపో ప్రారంభించారు. ఈనాటి వరకు ఒక్క కొత్త బస్సుకూడా ఈ డిపోకు కేటాయించలేదు. కొత్తగూడెం, ఖమ్మంకు అనేక కొత్త బస్సులు వచ్చాయి. ఇల్లెందు బస్ డిపో ప్రారంభోత్సవానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పింది ఒకటైతే ఆ తర్వాత జరిగింది మరోటి. డిపోకు కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం డిపోల నుంచి 24 బస్సులు కేటాయిస్తామని ప్రకటించి 20 బస్సులే కేటాయించారు. 10 నెలల కాలంలో ఈ డిపో కోసం ఆలోచించే నాథుడే లేడు. 23 బస్సులు కేటాయించినప్పటికీ 18 బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. 169 మంది వరకు సిబ్బంది కేటాయిస్తామని చెప్పి 106 మందిని కేటాయించారు. మైనర్ రిపేరుకు సంబంధించిన మెటీరియల్, మెకానిక్‌లు కూడా సరిపడా కేటాయించలేదు. కొద్దిమంది సిబ్బంది, మెకానిక్‌లు, ఇద్దరు ముగ్గురు సెక్యూరిటీ గార్డులను కేటాయించి చేతులు దులుపుకున్నారు.

సౌకర్యాలు కల్పించని పాలకులు..

ఇల్లెందు బస్టాండ్ ఆవరణలో 2.75 ఎకరాల స్థలంలో రూ.3.75 కోట్ల (డీఎంఎఫ్) నిధులతో శాటిలైట్ డిపో ఏర్పాటైంది. ఈ డిపో మీద ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి, కారేపల్లి మండలాలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఇల్లెందు బస్ డిపోలో సౌకర్యాలు లేక ఇక్కడి డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. డిపోలో సైకిల్ స్టాండ్, రెస్టు రూం, డైనింగ్ హాల్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, కంప్యూటర్ గది తదితరములు లేవు. డ్రైవర్లు, కండక్టర్లు బస్సుల్లోనే కూర్చుని భోజనం చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు కనీస సదుపాయాలు లేవు.

బస్సుపాస్‌లకు కొత్తగూడేనికి పరుగులు..

ఇల్లెందు బస్ డిపో ఏర్పాటు చేసినా ఇక్కడ విద్యార్థులకు, జర్నలిస్టులకు సీనియర్ సిటిజన్స్‌కు, సీజనల్ బస్సు పాస్‌ల కోసం కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోంది. 10 నెలల కాలం గడిచినా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయలేదు. ఇల్లెందు డిపో ఉన్నా కొత్తగూడెం వెళ్లటం కారణంగా ఆర్థిక భారం భరించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు జోక్యం చేసుకోవాలని, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బస్సు డిపోను సందర్శించాలని, ప్రయాణికులు కోరుతున్నారు.



గుండాల రోడ్డులో పోలారం వద్ద ఆగిపోయిన బస్సు(ఫైల్)

కొత్త పాత అనే తేడా ఉండదు..



ఇల్లెందు డిపోలో ఉన్న బస్సులు పాతవి అని కొత్త బస్సులు ఇవ్వలేదనేది అపోహ మాత్రమే. సమయానికి ఆ ఊరికి వెళ్లిందా లేదా...? తిరిగి గమ్యం చేరుకుందా లేదా పరిశీలిస్తే కొత్త పాత అనే భావం రాదు. బస్సుల బాడీ, చాయిస్‌లు మాత్రమే మారవు.. లోపల ఉండే ప్రతీ పార్ట్ పని చేయనప్పుడు మార్చి వేస్తుంటాము. డిపోలో సదుపాయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. త్వరలో పరిష్కారం అవుతాయి. బస్సు పాస్‌లు ఇల్లెందులోనే ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం.

– బాణాల వెంకటేశ్వర్లు, డీఎం, కొత్తగూడెం డిపో